# వార్తలు

'ఆకాశవాణి - వార్తలు - చదువుతోంది మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి' ఢిల్లీనుంచి వెలువడుతున్నాయి వార్తలు - హైదరాబాదు, విజయవాడ, కడప, విశాఖ పట్నం కేంద్రాలు రిలే చేస్తున్నాయి... చిన్న చిన్న మంగలిపొది సైజులలో వున్న ట్రాన్సిష్టర్లకు చెవులు అతికించి కోట్ల ప్రజానీకం వింటున్నది - ఆకాశం నిండా వార్తలు పరంపరగా వ్యాపిస్తున్నాయి...

'ఆజ్ కా తాజా కబర్ - ఆజ్ కా తాజా కబర్-సుల్తాన్ బజార్ లో లాటీచార్జి' ఈవినింగ్ ఎడిషన్ పేపర్ పతాక శీర్షికను ఆకర్షణీయంగా పెద్దగా అరుస్తున్నాడు చౌరస్తాదగ్గర నిలబడి పత్రికలబ్బాయి. పేపర్లు హాట్ కేక్స్‌లా అమ్ముడవుతున్నాయి. వార్తలు పత్రికల రూపంలో నలుదిక్కులా వ్యాపిస్తున్నాయి-

'మీరీవార్త విన్నారా?' థియేటర్ ముందు పక్కింటి కామాక్షమ్మగారు పొరుగింటి పుల్లమ్మను ప్రశ్నించింది టిక్కెట్లిచ్చే వ్యవధిలోపల-

'ఏమిటది?'

'శాంతను హాస్పిటల్లో చేర్చారట-'

'అయ్యోయ్యో - ఎంత కష్టం వచ్చిందమ్మా రంగారావుకు - గతవారం దాకా అంతా పెళ్ళి నిశ్చయమనుకున్నారు కూడాను. ఉప్పులూ పప్పులూ బాగు చేయించుకున్నారు. ఆవకాయ అప్పడాలు పెట్టారు. పాలేరును కొబ్బరాకులకూ మామిడి మండలకూ పంపారు. ఇంతలోనే ఇలా ముంచుకొచ్చింది- ఏం రోజులో ఏం కలికాలమో అంతా మాయగా వుంది- అసలూ సూరమ్మ నోరు వట్టి పాపిష్టిది లేవమ్మా- ఆవిడ గడపలో కాలు పెట్టగానే వాళ్ళ కొంపకు శని ప్రారంభమైంది - ఇంతకూ శాంతమ్మ ఎలావుంది??'

'ఏమోమరి ఇంజెక్షన్‌లు ఇచ్చారట - కొన్ని ప్రత్యేకమైన మందులు విమానంలో తెప్పిస్తున్నారట'.

'విమానంలోనా? అబ్బ - ఎంత విచిత్రం! తర్వాత ఏమయింది'

'అక్కడితో ఆగిపోయింది కథ ఈవారం - మిగతా వచ్చే సంచికలో'.

పుల్లమ్మ హృదయం విలవిలలాడిపోయింది - ఎంతకష్టం. ఏమికథ! ఇంకా వారం రోజులాగాలా ఈ శాంతనుగూర్చి తెలుసుకోడానికి - రచయిత్రి త్రై కేయిమీదా. పత్రికా సంపాదకునిమీదా ఆమెకు వచ్చిన కోపం కొలిచే మీటరు ఏదీలేదు సృష్టిలో.

'అయ్యా ఒక్కపైసా ధర్మం' థియేటర్ పక్కనే గాంధీ బొమ్మకు కాస్త దూరంలో వున్న హోటల్‌ముందు బిచ్చగాని ఆక్రందనం - హోటల్లోకి జనం పోతూవున్నారు - వస్తూవున్నారు.

బిచ్చగాని భిక్షాపాత్ర మాత్రం ఉదయం ఏడింటినుండీ సాయంత్రం పదింటివరకూ ఖాళీగానే వుంది.

ఈలోపల ఆ హిమాయత్‌నగర్ రోడ్డుగుండా కొన్ని వేల సైకిళ్లు కొన్ని వందలకార్లూ ప్రయాణంచేశాయి ... ఉదయం ఏడింటినుంచి సాయంత్రం పదింటి లోపల ఎన్నో కథలు జరిగాయి-ఎన్నో వార్తలు వెలువడ్డాయి. కాని బిచ్చగాని గిన్నె మాత్రం అలాగే ఖాళీగా వుంది. బిచ్చగాడు మాత్రం ఒక్క వార్తనూ సృష్టించలేకపోయాడు.

'మీరీ వార్తలు ఆకాశవాణినుండి వింటున్నారు. కౌలాలంపూర్‌లో ప్రధాన మంత్రి గౌరవార్థం అసలైన భారతీయ పద్ధతిలో విందుభోజనం ఏర్పాటుచేశారు. అందులో దక్షిణాదివారి సాంబారూ, తెలుగువాళ్ళ అప్పడాలూ, ఆవకాయా కూడా వడ్డించారు....' హోటల్లోని భోక్తలంతా ఆసక్తితో వింటున్నారీ వార్తను. ప్లేట్లమీద ప్లేట్లు మసాలాదోసెలూ ఉల్లి పెసరట్లూ ఆర్డరివ్వబడుతున్నాయి.

'ఏమండోయ్ మీరీవార్త విన్నారా? ప్రెసిడెంట్ జాన్సన్ కుక్క చెవులు పట్టుకున్నాడని శునక ప్రియులైన లక్షలాది ప్రజలకూ కోపం వచ్చిందిట' ఈ హోటల్లోకి ప్రవేశిస్తూ ఒకాయన తోటి వ్యక్తితో అంటున్నాడు.

'అవునుమరి, వాళ్ళకు జీవ జంతువులమీద అంత ప్రేమండీ - కుక్కలను పక్కల్లో పడుకోబెట్టుకోని పాలూ వెన్నతో ఎత్తుకెత్తుగా పెంచుతారు వాళ్ళు.'

'బాబూ ఒక్క పైస ధర్మంచేయండీ' బిచ్చగాడి తొమ్మిదివందల తొంభై అయిదో ఆక్రందన.

'పోరా - ముష్టి ముండాకొడకా.... ఆఁ చెప్పండి రావుగారూ - ఇంతకూ మీరీ వార్త ఏ పత్రికలో చదివారూ....'

ఆ ముష్టి ముండాకొడుకు కూడా ఒక భారతీయుడే - వాడు కుక్కకాదు, కుక్కకన్నా ఉత్తమమైన జీవమే - మనిషే - కాని వాడు వార్తలను సృష్టించ లేడు - వాడి ఫోటో పత్రికల్లో రాదు - టెలివిజన్‌లో కన్పడదు - అందుకే వాడంటే ఎవరికీ ఆసక్తిలేదు.

'మీరీ వార్తలు ఆకాశవాణినుంచి వింటున్నారు సైబీరియాదేశపు రాష్ట్రపతి సతీమణికి నిన్న టెవిపోటు కొంచెం తీవ్రంగా వచ్చింది - రాష్ట్రపతి తన అరబ్ రిపబ్లిక్ పర్యటన రద్దుచేసుకొని గృహోన్ముఖులైనారు. ఆమె త్వరగా కోలు కోవాలని కోరుతూ భారత ప్రభుత్వమూ ప్రజల తరఫున మన రాయబారి ఉన్న తాధికారికమైన ఒక ఆందోళనాపత్రాన్ని సమర్పించినట్లు ఇప్పుడే అందిన తాజా వార్త-

'బాబూ - పాణాలు పోతున్నై! ఒక్క పైస ధరమం తంఁడీ'

బిచ్చగాని యాభై ఆరో ఆక్రందన.

"దొంగవెధవలండీ వీళ్ళు - అదేదో సినిమాలో చూపలా - ముష్టివేషాలు వేసుకునేదీ, మూటలూ నోటులూ దోచుకునేదీ" టప్పయ్య తన స్నేహితుడితో అంటూ హోటల్లో ప్రవేశించాడు. టప్పయ్యను ఎదురుగా అంతా వెంకటప్పయ్య అంటారు - చాటున అల్లాటప్పయ్య అంటారు - అయన మాత్రం షార్ట్‌కట్‌గా టప్పయ్య అని పెట్టుకున్నాడు పేరు.

"ఓ రెండు పెసరట్లు రోష్టు పట్టా సర్వరూ....అ, ఏమిటీ వార్తలూ టప్పయ్యగారూ ఈ మధ్య"

వార్తలు కావాలంటే టప్పయ్యగారినే అడగాలి. అసలాయనే ఓ పెద్ద వార్త - రోజూ పత్రికల్లో వార్తలు సృష్టించకపోతే అయనకు నిద్ర రాదు -

చార్మినార్ వద్ద కోళ్ళ ఉత్పత్తి కేంద్రాన్ని సనత్‌నగర్‌కు మార్చాలని సుల్తాను బజారు గంటస్తంభం వద్ద విరామం లేకుండా ఏడు గంటలు మాట్లాడి ఒకసారి, డెభ్భైరోజులు నిరసన వ్రతం పూని ఒకసారి, ప్రముఖమైన పతాక శీర్షికలు సృష్టించిన ఘనుడీయన. సమ్మెలు సత్యాగ్రహాలు చేసి వార్తలు సృష్టిస్తాడు. పొద్దున్నే ఇడ్లీ తిని రిలే హంగర్ స్ట్రైక్ చేస్తాడు పేదల అభ్యుదయంకోసం.

టప్పయ్యగారు నోరు చప్పరిస్తూ "ఆఁ ఏమున్నాయి వార్తలూ"
"మామూలే - అన్నట్లు మా శంకరంలేడూ - అదేనండీ బాచిగాడూ . వాడు తిరుపతి పోయాడు నిన్న -"

"ఆహా - మంచివార్తే - భక్తి కుదిరిందన్నమాట వాడికి"

"ఈ జన్మలోనా - అయ్యో ఖర్మ - అందుక్కాదండీ వాడు వెళ్ళింది. వాడికి సినిమా పిచ్చి ఎక్కువని మీకు తెలిసిందేగా - వాడి అభిమాన నటి రాణికి తిరుపతిలో పెళ్ళట - అందుకని...."

'ఓహోహో భలే మజావార్త - రాణి చివరకు పెళ్ళిచేసుకుందేమిటి?? అందులోనూ శంకరానికి ఇన్విటేషను రావడం....'

'ఏమిటండీ మీరు మరీనూ - ఇట్లాంటి అంట్ల వెధవలకందరికీ ఇన్విటేషనెవడు పంపుతారండీ - వీడే స్వంతచార్జీతో పోయాడు - తీరాచూస్తే ఆ గూడూరు దగ్గరే పోలీసులు ప్రయాణీకులను దింపివేస్తున్నారట - ఓహ్ - తీర్థప్రజ - తెలుగుదేశం నలుమూలలనుండీ తిరణాల జనం - స్పెషల్ బస్సులో రాణి పెళ్ళి చూడటానికి-ఆ శతకోటి బోడిలింగాల్లో ఈ శంకరంగాడొకడూ...'

వెంకటప్పయ్యగారు చెపుతున్న రాణి పెళ్ళివార్త, స్నేహితుడికి రాబోయే రోష్టు పెసరట్టుకన్నా మహా రుచిగావుంది - నాలికనాడిస్తూ నోట్లో నీళ్ళూరుతుంటే ఎగలాగుతూ గుడ్లు మరీ పెద్దవిచేసి వింటున్నాడు....

వార్త, అలా అలా ఘుమఘుమా సాగిపోతున్నది.

రేడియోవార్తలు ముగిశాయి - నైట్‌షిఫ్టు జర్నలిష్టులొక నలుగురు కాఫీ కోసం ఆ హోటలుముందు దిగారు . ఆగా సేవటికి పదినెలలూ కష్టపడి మోసినా

ఒక్క శిశువుకూడా జన్మించని వెంకాయమ్మతో ఫామిలీప్లానింగ్ డిపార్ట్‌మెంటు అధ్వర్యాన జరిగే ఇంటర్వ్యూలో వీళ్ళంతా పాల్గొనబోతున్నారు.

'అయ్యా, ఒక్క పైస' బిచ్చగాడి యాభై ఏడో ఆక్రందన.

పదినెలలు మోసికూడా పిల్లలను కనని గజగర్భిణి.

ప్రపంచం మొత్తాన్నీ ఆకర్షించే వార్తను సృష్టించిన వెంకాయమ్మతో ఇంటర్వ్యూగూర్చి ఆలోచిస్తున్న జర్నలిష్టులకు ఈ బిచ్చగాడి అరుపు వినపడ లేదు....

నిజానికి వాడి అరుపు ఎవరికి విన్పడుతుంది?

రైల్వేస్టేషనులోనూ రోడ్డు చౌరస్తాలోనూ థియేటర్లముందూ దేవస్థానాల ముందూ ఎప్పుడూ విన్పడే ఆక్రందనలే ఇవి - వీటిని ప్రత్యేకంగా పట్టించుకో వలసిన అవసరం ఏముంది?

'అయ్యా ధర్మం -' యాభై ఎనిమిదవ ఆక్రందన-

'అమ్మా ఆకలి' యాభై తొమ్మిదవ ఆక్రందన-

'బాబూ అన్నం' వెయ్యో ఆక్రందన-

బిచ్చగాడు పడిపోయాడు - పగలంతా సెగలు పొగలు చిమ్మిన వడ గాలి దెబ్బకు సొమ్మసిల్లిన ప్రాణం ఆకలితో మరీ నీరసించి రెపరెపలాడు తున్నది గాలిలో దీపంలా-

రోడ్డుపక్కనే పోతున్న ఓ కుక్క ఈ బతికిన శవాన్ని వాసనచూచింది. నాలుకతో కాలిని నాకింది-

మనిషా? మాంసపిండమా?? దానికేమీ అర్థంకాక అలాగే నాకుతున్నది.

బిచ్చగాడు కళ్ళు తెరిచాడు - ఎదురుగా కుక్క తన్ను ముట్టుకోవడం చూచాడు-

భయమో, బాధో తెలియదు కాని శక్తినంతా కూడగట్టుకొని చివరిసారిగా లేచే ప్రయత్నం చేశాడు.

తన ముఖంపైన నాలుక నాడించబోయే కుక్క నొక్కసారి బలంగా పట్టుకొని గొంతుపైన కరిచాడు - అంతవరకూ కండ తెగి బిచ్చగాడి నోట్లోకి వచ్చింది.

బిచ్చగాడు విశ్వామిత్రుడైనాడు.

కుక్కమాత్రం విలవిల తన్నుకొని కిందపడిపోయింది.

ఆశ్చర్యం!

భయంకరంగా అరిచి, కొద్దిసేపట్లోనే కుక్క ప్రాణాలు వదిలింది.

అంతా ఈ దృశ్యం చూచారు

అన్ని నోళ్ళ వాగుళ్ళలోనూ ఇదే సంగతి.

ఇదే వార్త !

"మనిషి కుక్కను కరిస్తే వార్త" అనే సామెత నిజమైంది!

బిచ్చగాడు మృత్యుంజయుడైనాడు. జీవితంలో మొదటిసారి 'వార్త'ను సృష్టించాడు టెలీప్రింటర్లు ధనధన మ్రోగాయి. కెమెరాలు క్లిక్కుమన్నాయి!!

జాతీయ, అంతర్జాతీయ పత్రికలన్నీ దీనిని ప్రముఖంగా బాక్సు కట్టి ప్రచురించాయి.